గణనాథా నమోస్తుతే!


పులిచెర్లలో..


పలమనేరు : వినాయకుని విగ్రహం వద్ద ప్రత్యేక పూజల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర

పుంగనూరు: వినాయక చవితి పండుగ సందర్భంగా సుమారు 10 నుంచి 15 అడుగుల ఎత్తు గల వినాయక విగ్రహాలను పట్టణంలోని కట్టకిందపాళ్యెం, తేరువీధి, హైస్కూల్ వీధి, తూర్పు మొగశాల, బాలాజి థియేటర్ వద్ద, నాగపాళ్యెం, బస్టాండు, బజారువీధి, ఎన్ఎస్.పేట తదితర ప్రాంతాలలో ఏర్పాటు చేశారు. విగ్రహాల ఏర్పాటుకు మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఒకొక్క వార్డుకు రూ.20 వేల చొప్పున రూ.6.20 లక్షలు వితరణ చేశారు. మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం చేశారు. బుధవారం నుంచి 10 రోజుల పాటు వినాయక విమజ్జన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్, సీఐ రాఘవరెడ్డి, ఎస్ఐ మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు, మున్సిపల్ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

సదుం: మండలంలో వినాయక చవితి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రతి గ్రామాన వినాయక విగ్రహాల కోసం ప్రత్యేక మండపాలను ఏర్పాటు చేశారు. వివిధ రూపాలలో ఏర్పాటు చేసిన విగ్రహాలు ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని పలు గ్రామాల్లో వినాయకుని విగ్రహాలను ఏర్పాటు చేసి ఘనంగా పూజలు చేశారు. అలాగే ప్రతి ఇంటా వినాయక ప్రతిమలు కొలువుదీర్చారు.

పలమనేరు నియోజకవర్గం

పలమనేరు: వినాయకచవితి పురస్కరించుకుని పట్టణంతోపాటు మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో బొజ్జ గణపయ్య రకరకాల విగ్రహాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. స్థానిక బజారువీధి, మారెమ్మ వీధుల్లోని వినాయకుని విగ్రహం వద్ద ప్రత్యేక పూజల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర, ఆయా వార్డుల్లోని సంబంధిత వార్డు కౌన్సిలర్లు నిర్వాహకులతో కలసి పాల్గొన్నారు. విగ్రహాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అన్నదానం చేశారు. స్థానిక వాసవి కల్యాణ మండపంలో వీణ, తబలా, నాదస్వరం, డోలు, ఫిడేలు వాయిద్యాలను వాయిస్తున్న కదిలే వినాయకుడి విగ్రహాలు భక్తులను ఆకర్షించాయి. దోరణాల చెంగన్న వీధిలో వినాయకుడిపై కదిలే నాగపడగలు, రంగాపురంలో 21 అడుగుల గణపయ్య, మార్కెట్ కమిటీ వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాలు ఆకట్టుకున్నాయి.

గంగవరం: మండల ప్రజలు వినాయకచవితి వేడుకలను కోలాహలంగా జరుపుకున్నారు. సోమవారం అన్ని గ్రామాల్లోని గణనాధుని విగ్రహాలు ప్రతిష్ఠించి పూజలు చేశారు.

పెద్దపంజాణి: మండల ప్రజలు వినాయక చవితి వేడుకలను సోమవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా గ్రామాలలో ప్రత్యేక పందిళ్లను ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలను కొలువుదీర్చి, పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు వేపచెట్టు, రావి చెట్టు, పుట్టకు పూజలు చేశారు. మండపాల వద్ద అన్నదానం చేశారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బైరెడ్డిపల్లె: మండలవ్యాప్తంగా ప్రజలు వినాయకచవితి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, రాజంపేట వైఎస్సార్ సీపీ ఎన్నికల పరిశీలకులు, జెడ్పీటీసీ ఆర్.కేశవులు లక్కనపల్లె, బైరెడ్డిపల్లె, తీర్థం, నెల్లిపట్ల గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. తీర్థంలో జీవిత, శరత్‌కుమార్ హరికథాగానం చేశారు. బైరెడ్డిపల్లె వాసులు శ్రీ కోదండరామస్వామి ఆలయ సమీపంలోని కోనేటిలో నిమజ్జనం చేశారు.

కుప్పం నియోజకవర్గం

రామకుప్పం: స్థానిక రామనగర్, శివాజీనగర్, దిగువ వీధి, కోదండ రామననగర్ కాలనీల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి. ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసారు. అత్తికుప్పంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. గ్రామాల్లో యువకులు కోలాహలంగా వినాయక విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువుల్లో నిమజ్జనం చేశారు.

గుడుపల్లె: మండలవ్యాప్తంగా వినాయకచవితి పండుగను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. సోమవారం రాత్రి అగరం, గుడుపల్లె, కనమనపల్లె, యామాగనిపల్లె తదితర గ్రామాలలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. పచ్చటి తోరణాలు, విద్యుత్ దీపాల అలంకరణలతో మండపాలను ఏర్పాటు చేసి, వాటిల్లో వినాయక విగ్రహాలను కొలువుదీర్చారు. పూజార్చనలు, అభిషేకాలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


రామకుప్పం: ప్రథమ బహుమతి పొందిన ముగ్గు


పుంగనూరు: కట్టకిందపాళ్యెంలో..


పలమనేరులోని బొజ్జ గణపయ్య విగ్రహాలు


గుడుపల్లె : అగరంలో..


పుంగనూరు: తేరువీధిలో..


సదుం: చెరుకువారిపల్లెలో చవితి వేడుకలు


పెద్దపంజాణి : రాయలపేట బలిజ వీధిలో..


బైరెడ్డిపల్లె : చవితి వేడుకల్లో ఎంపీపీ, జెడ్పీటీసీ, రాజంపేట ఎన్నికల పరిశీలకులు

క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్కలు నాటుతున్న ఆంజప్ప

పెద్దపంజాణి: ప్రతి ఒక్కరూ తలా ఒక మొక్క నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని నేషనల్ హ్యూమన్ రైట్స్(ఆర్‌టీఐ సెల్, ఏపీ) ప్రెసిడెంట్ ఎస్. ఆంజప్ప కోరారు. మంగళవారం మండలంలోని నిడిగుంట ఉన్నత పాఠశాల ప్రహరీ ఆనుకుని, గ్రామం నుంచి పలమనేరుకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ, వృక్షసంపద తరిగిపోతే మానవాళి భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని యువత సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. ఉపాధ్యాయులు, సర్పంచ్ సుబ్రమణ్యం రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని పుచ్చలవారి పల్లె ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి 24మంది విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్,ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఎంఈఓలు సిద్ధరామయ్య, తాతయ్య, నాదమునిరెడ్డి, నాగరాజ ప్రసాద్, చంద్రశేఖరరెడ్డి, దామోదర్, ప్రసాద్, గోవిందరెడ్డి, సంతోష్,రామ్మూర్తి, నాగిరెడ్డి, హెచ్ఎం ధననాయక్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యాపకుల సంఘ సలహాదారుగా రెడ్డెప్ప


రెడ్డెప్పను సన్మానిస్తున్న సహచర అధ్యాపకులు

పుంగనూరు: జిల్లా ప్రభుత్వ అధ్యాపకుల సంఘ సలహాదారుగా పట్టణానికి చెందిన అధ్యాపకుడు డాక్టర్ ఎం.రెడ్డెప్పను ఎన్నుకున్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ బసవరాజ కళాశాలలో రెడ్డెప్పను సహచర అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. రెడ్డెప్ప మాట్లాడుతూ, ప్రభుత్వ లెక్చరర్ల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ దయానందరాజు, అధ్యాపకులు మోహనచారి, వెంకటరెడ్డి, విశ్వనాథ్, మోహనాచారి, మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగులకు నియామక పత్రాలు


నియామకపు పత్రాలు అందజేస్తున్న చైర్మన్ అలీమ్‌బాషా, అమ్ము

పుంగనూరు: మున్సిపాలిటీలో ఎంపికైన అంగన్‌వాడీ ఉద్యోగులకు నియామకపు పత్రాలను చైర్మన్ ఆలీమ్ బాషా మంగళవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ, పట్టణంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, సహాయక పోస్టులను ఎప్పటికప్పుడు భర్తీ చేశామని, ఆ కేంద్రాల్లో తల్లీబిడ్డల సంరక్షణకు మెరుగైన సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, పార్టీ నాయకులు ఇంతియాజ్‌ఖాన్, కొండవీటి నరేష్ పాల్గొన్నారు.

కాణిపాక ప్రచార రథానికి ప్రత్యేక పూజలు


పలమనేరుకొచ్చిన కాణిపాకం ధర్మ ప్రచార రథం

పలమనేరు: కాణిపాకం బ్రహ్మోత్సవాల ప్రచారంలో భాగంగా పలమనేరు పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ప్రచార రథం వచ్చింది. కాణిపాకం ఆలయ ప్రాశస్త్యం, స్థలపురాణం, నైతిక విలువలు, సనాతన ధర్మం, ఆలయ పవిత్రతపై దేవదాయశాఖ అధికారులు వివరించారు. భక్తులు రథానికి పూజలు చేశారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్సీ సాయం


అగరం జోగిండ్లులో మృతుని కుటుంబానికి నగదు అందిస్తున్న జెడ్పీటీసీ క్రిష్ణమూర్తి

గుడుపల్లె: అనారోగ్యం కారణంగా మృతి చెందిన రెండు కుటుంబాలకు మంగళవారం జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం చేశారు. మండలంలోని అగరం జోగిండ్లు గ్రామంలోని మేకలప్ప, చిన్నగొల్లపల్లెలో వెంకటప్ప మృతి చెందారు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్సీ పార్టీ నాయకుల ద్వారా ఈ సాయం అందేలా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు క్రిష్ణమూర్తి, పార్టీ నాయకులు, సర్పంచులు రామమూర్తి, చెన్నరాయస్, వెంకటాచలం, రవి, నారాయణప్ప, ఆనంద్, శ్యామరాజు, మంజునాథ్ పాల్గొన్నారు.

గ్రామాల్లోనూ వైద్య సేవలు


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పుష్పకుమారి

సదుం: మారు మూల గ్రామాల ప్రజలకు సైతం మెరుగైన వైద్య సేవలు అందించడమే ఆయుష్మాన్ భవ లక్ష్యమని సీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ పుష్పకుమారి అన్నారు. వైద్యశాలలో మంగళవారం ఆయుష్మాన్‌భవ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించి ఆమె మాట్లాడారు. వైద్యానికి ప్రభుతం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఇందులో భాగంగా 19న, 22, 26న 16మంది వైద్య నిపుణులతో వైద్య శిబిరాలు నిర్వహిస్తామని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం 280 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్లప్ప, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, సభ్యులు రమాదేవి, మురళి, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న కాలనీకి బోరు మంజూరు


బోరు డ్రిల్లింగ్ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ ఈశ్వరయ్య, సర్పంచ్ బాషా మసూద్

సోమల: మండలంలో కందూరు పంచాయతీలోని జగనన్న కాలనీలో మంగళవారం స్థానిక సర్పంచ్ బాషా మసూద్ ఆధ్వర్యంలో ఎంపీపీ ఈశ్వరయ్య బోర్ డ్రిల్లింగ్‌కు పూజలు చేసి ప్రారంభించారు. ఇక్కడ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కొత్త బోరును మంజూరు చేయడంతో డ్రిల్లింగ్ చేయిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, ఎంపీడీఓ నాగరాజ, వైఎస్సార్‌సీపీ నేతలు గాలి సురేష్, వెంకస్వామి పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు ముఖ్యం


కందూరు సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగరాజ

సోమల: ప్రజలకు మెరుగైన సేవలు అందివ్వాలని సచివాలయ సిబ్బందిని ఎంపీడీఓ నాగరాజ ఆదేశించారు. మంగళవారం మండలంలోని కందూరు మేజర్ పంచాయతీ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు.రికార్డులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించాలని, విధిగా యూనిఫాం ధరించాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని విజయవంతం చేయాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పలమనేరు: మండలంలోని జగమర్ల వద్ద చెన్నయ్-బెంగళూరు జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గొబ్బిళ్లకోటూరుకు చెందిన హేమచంద్ర(35) తీవ్రంగా గాయపడి తిరుపతి రుయాలో చికిత్సపొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. పట్టణం నుంచి తన ఐదేళ్ల కొడుకుతో కలసి బైక్‌పై వెళుతుండగా ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొనడం విదితమే. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

బైజూస్ ట్యాబ్స్‌పై అవగాహన



మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ సుధాకర్

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని 15 మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా బైజూస్ నోడల్ అధికారి సుధాకర్ మాట్లాడుతూ, బైజూస్ ట్యాబ్‌లను ఎలా వినియోగించాలి? అందులో సాంకేతిక సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలి? గణితం, సైన్సు సబ్జెక్టులకు సంబంధించి పిల్లలకు ఎలా బోధించాలి? అనే అంశాలను వివరించారు. టీచర్ల అనుమానాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం, పలు పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'పై అవగాహన

పలమనేరు: వచ్చేనెల 17న పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమంపై స్థానిక 13 వార్డులో కౌన్సిలర్ నాగరాజు సచివాలయ సిబ్బందితో కలసి ఇంటింటికీ వెళ్లి కరపత్ర ప్రచారంతో అవగాహన కల్పించారు. ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకుని అవసరమైన వారికి ఈ క్యాంపులో వైద్యసేవలందిస్తామని తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యం, నిందితుడి అరెస్ట్ చూపుతున్న సెబ్ డీటీఎఫ్ అధికారులు

పలమనేరు: పలమనేరు సెబ్ పరిధిలోని మారేడుపల్లె క్రాస్ వద్ద అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న గంగవరం మండలం కొంగోళ్లపల్లెకు చెందిన వెంకటప్ప(56)ను అరెస్ట్ చేసి అతని నుంచి 40 టెట్రా ప్యాకెట్లును సీజ్ చేసినట్టు డీటీఎఫ్ ఎస్ఐ మాధవస్వామి మంగళవారం తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలోని బేటనూరు వైన్స్ నుంచి అక్రమంగా మద్యం తెచ్చి స్థానికంగా అధిక ధరలకు విక్రయించేవాడని ప్రాథమిక విచారణలో తేలిందని చెప్పారు. ఈ దాడుల్లో ఎస్ఐ మస్తాన్‌వలి, సిబ్బంది గౌతమ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నిమజ్జనం చేయాలి


రొంపిచెర్ల : మాట్లాడుతున్న ఎస్ఐ కృష్ణయ్య


పులిచెర్ల : సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసులు


సోమల: ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకట నరసింహులు

రొంపిచెర్ల: వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహాలను ప్రశాంతంగా నిమజ్జనం చేయాలని ఎస్ఐ కృష్ణయ్య అన్నారు. ఆయన మంగళవారం సాయంత్రం వినాయక విగ్రహాల నిర్వాహకులకు అవగాహన సమావేశం నిర్వహించారు. వినాయకుని విగ్రహాలను మూడు లేదా ఐదు రోజుల్లోపు నిమజ్జనం చేయాలన్నారు. నిమజ్జనం సమయంలో ఎలాంటి గొడవలకు తావివ్వరాదని, ఎక్కడైనా గొడవలు చోటుచేసుకుంటే నిర్వాహకులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ తులసీరాం, సర్పంచ్ ఇబ్రహీంఖాన్, వైఎస్సార్ సీపీ నాయకులు కోటా వెంకటరమణ, కరీముల్లా, సైపూల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సూచనలు పాటించాలి

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు పోలీస్ స్టేషన్‌లో మంగళవారం వినాయక ఉత్సవ కమిటీ సభ్యులకు సీఐ శ్రీనివాసులు సమావేశం నిర్వహించారు. వినాయకుని విగ్రహాలను ఎక్కడెక్కడ నిమజ్జనం చేస్తారో పోలీసులకు ముందుగానే తెలియజేయాలని, నిమజ్జన సమయంలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. చిన్నపిల్లలను నిమజ్జన ప్రాంతాలకు తీసుకెళ్లరాదని, నిబంధనలు పాటించి సజావుగా కార్యక్రమాన్ని ముగించాలన్నారు. సమావేశంలో ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో చవితి వేడుకలు

సోమల: వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్ఐ వెంకట నరసింహులు ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. మండలంలోని బురుజుపల్లె, మేటిమంద, చిన్న సోమల, నంజంపేటలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సోమవారం ఆయన పరిశీలించారు.కానిస్టేబుళ్లు సమీవుల్లా, రమణ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనాల వద్ద జాగ్రత్తలు పాటించండి

గంగవరం: వినాయక విగ్రహాల నిమజ్జనాల విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని గంగవరం ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి మంగళవారం కోరారు. మండలంలో విగ్రహాలు ఏర్పాటు చేసిన ప్రతి చోటా మూడవ రోజు నిమజ్జనాలు సాయంత్రంలోపు పూర్తి చేయాలని, చెరువులు, కుంటల వద్ద నిమజ్జనానికి గుంపులుగా వెళ్లరాదని, ముఖ్యంగా చిన్నపిల్లలను ఇళ్ల వద్దనే ఉంచాలన్నారు.

వ్యాన్ బోల్తా: నేల'పాలు'


బోల్తా పడిన పాల వ్యాన్

వి.కోట: వి.కోట-పలమనేరు జాతీయరహదారి కస్తూరి నగరం వద్ద మంగళవారం పాల వ్యాన్ బోల్తా పడింది. స్థానికుల వివరాల మేరకు.. కస్తూరినగరం సమీపంలో టైరు పేలడంతో గాయత్రి డెయిరీ పాల వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో వ్యానులోని పాల క్యాన్లు మొత్తం కింద పడ్డాయి. పాలు మొత్తం నేల పాలయ్యాయి. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

వేడుకగా సోమవారోత్సవాలు ప్రారంభం


క్యూలో బారులు తీరిన భక్తులు

రామకుప్పం: మండల కేంద్రానికి సమీపంలోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఏటా భాద్రపద మాసంలో నిర్వహించే సోమవారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం శ్రీస్వామిఅమ్మవార్లకు ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణల అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వినాయకచవితి, సోమ వారోత్సవం ఒకే రోజు రావడంతో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు కావడి మొక్కులను సమర్పించారు. కొందరు వీపునకు కొక్కీలు గుచ్చుకుని వచ్చి మొక్కుబడులు చెల్లించారు. ఉదయం నుంచే దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఉభయ దేవేరులతో సుబ్రమణ్యస్వామి మయూర వాహనంపై పురవీధుల్లో విహరించారు. భక్తులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు.